క్లుప్తంగా

నేడు మెగా రక్తదాన శిబిరం

ఏటూరునాగారం : అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సాహం ఉన్న వ్యక్తులు రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



వాజేడు: తహసీల్దార్‌గా వీరభద్ర ప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ములుగు కలెక్టరేట్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన తహసీల్దార్ శ్రీనివాస్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. నూతన తహసీల్దార్ వీరభద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. బదిలీ తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ రాహుల్ చంద్రవర్మ, ఆర్ఐ కుమారస్వామి ఉన్నారు.

వెండి పట్టీలు, నగదు చోరీ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సీఎస్ఐ స్కూల్ సమీపంలోని జామా మజీద్ మత గురువు మహ్మద్ రెహమాన్ ఇంటిలో సోమవారం రాత్రి 7 తులాల వెండి పట్టీలు, రూ.35 వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. తన సమీప బంధువు ఇంటికి ఊరికి వెళ్లిపోవడంతో ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

స్పాట్ అడ్మిషన్లు

ములుగు రూరల్ : వరంగల్ రీజియన్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో బాలుర, బాలికల పాఠశాలలో 5 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలకు ఈ నెల 12న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ ఉదయం 10 గంటలకు మడికొండలోని బాలుర సాంఘిక గురుకుల పాఠశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాల ఎంట్రెన్స్ హాల్ టికెట్, అనాథలు అయితే తల్లి,తండ్రి మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని అన్నారు. పూర్తి వివరాల కోసం 9949892426, 7680906134 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జాగ్రత్తగా ఉండాలి



ఏటూరునాగారం: గోదావరి వరద వేగంగా పెరుగుతుందని, ఒడవాడ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై తాజొద్దీన్ మంగళవారం ముంపు ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే మత్స్యకారులు ఎవరు కూడా చేపల వేటకు, పడవలతో గోదావరిలోకి వెళ్లొద్దని హెచ్చరించారు. శిథిలమైన ఇంటి నుంచి బయటకు రావాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రమాదేవి, మత్స్యకారుల సంఘం నాయకుడు చిటమట రఘు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలలో కోతుల స్వైరవిహారం



గాయపడిన దేవమ్మ

ఎస్ఎస్‌తాడ్వాయి: స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. కోతుల బెడదకు విద్యార్థినులు బెంబేలెత్తి పోతున్నారు. ఇటీవల పాఠశాలలో పని చేస్తున్న డెయిలీవేజ్ వర్కర్ కొత్తపేట శ్రీరాములు కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. తాజాగా మంగళవారం పాఠశాలలో వర్కర్‌గా పని చేస్తున్న రాజం దేవమ్మ వంటపాత్రలను శుభ్రం చేస్తుండగా కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయమైంది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ములుగు సివిల్ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు.గిరిజన సంక్షేమశాఖ అధికారులు కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్థికసాయం

టేకుమట్ల: మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన పైడిపెల్లి సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గౌడ సంఘం మండల నాయకులు మంగళవారం పరామర్శించి, మృతుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.14వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కును అందించారు. ఆర్థిక సాయంలో రూ.3 వేలను అందించిన ఎస్సై కృష్ణప్రసాద్‌గౌడ్‌కు గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నేరేళ్ల రామకృష్ణగౌడ్, బండి శ్రీనివాస్, బొల్లికొండ రాజయ్య, రాజయ్య, స్వామి, సురేష్, రాములు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తి గొప్పది



ఎస్ఎస్‌తాడ్వాయి : చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి గొప్పదని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని కాటాపూర్‌లో సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలహీన వర్గాల హక్కుల కోసం సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు తనవంతు పోరాటం చేసిందని కొనియాడారు. చాకలి ఐలమ్మ త్యాగాల ఫలితమే తెలంగాణ అని, తెలంగాణ కోసం ఐలమ్మ చేసిన సేవలు మరువలేవన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులి నర్సయ్య, నాయకులు మేడిశెట్టి నర్సింహయ్య, దొడ్డిపల్లి సాంబయ్య, బందెల తిరుపతి, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ సరిత, నర్సింగారావు, బైరి ప్రశాంత్, పర్వతాల సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని రైతు వేదికలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిత, ఏఈఓ కల్యాణి, రజక సంఘం నాయకులు రమేశ్, సాయిబాబా, శ్రీరాములు, రవి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, నాగేశ్వరావు, సాయి, వేణు, మల్లికార్జున్, సతీష్, శ్రీశైలంతో పాటు తదితరులు పాల్గొన్నారు.



కన్నాయిగూడెం : రైతు వేదికలో..



వాజేడు: రజక సంఘం ఆధ్వర్యంలో..

నిత్యావసర సరుకుల పంపిణీ



మల్లికార్జున్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భూక్య జంపన్న, తదితరులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున్ ఇటీవల ప్రమాదవశాత్తు వరదలో పడి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకు భూక్య జంపన్న ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేసి మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దంగుల మల్లయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేష్ గజ్జల మహేష్, మహిళ నాయకురాలు స్వరూప, నాయకులు వసంతరావు, రాజబాబునర్సింగరావు, నవీన్, పోరిక శ్యామల్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్‌బీఐ క్విజ్‌తో రూ.10 లక్షలు గెలుపొందొచ్చు



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ మల్లేశం

ములుగు: భారత రిజర్వ్ బ్యాంకు జాతీయ స్థాయిలో నిర్వహించే క్విజ్ పోటీల్లో పాల్గొని రూ.10 లక్షల వరకు బహుమతి పొందవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం తెలిపారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులకు ఈ క్విజ్ పోటీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ ఏర్పడి 90 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు ఈ పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రథమ బహుమతి పొందిన వారికి రూ 10 లక్షలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.8 లక్షలు, తృతీయ స్థానం పొందిన వారికి రూ.6 లక్షలు బహుమతిగా గెలుచు కోవచ్చన్నారు. పోటీలకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదన్నారు. క్విజ్ పోటీల కన్వీనర్ రాధిక మాట్లాడుతూ పోటీలు నాలుగు దశల్లో ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారి వయస్సు 25 సంవత్సరాలు మించకూడదన్నారు. సెప్టెంబర్17 లోగా ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలయ్య, కవిత, భాస్కర్, నాగమణి, సోమన్న, సరిత, శిరీష, అనిల్ కుమార్, ఉదయ్, విజిత, జగదీష్, తేజు లత, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి



మొక్కులు చెల్లించుకుంటున్న రమేశ్‌కుమార్

ఎస్ఎస్‌తాడ్వాయి: కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి జరుగుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొల్లు రమేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీసీసీ చీఫ్ పదవి మహేశ్‌కుమార్‌గౌడ్‌కు రావాలని వనదేవతలకు మొక్కుకున్న మొక్కు నెరవేరడంతో అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌కు అమ్మవార్ల ఆశీస్సులు అందించాలని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పరీక్ష వెంకన్న, యువజన సంఘం నాయకుడు బొల్లు నాగేంద్ర, నాయకులు వర్దెల్లి వెంకన్న పాల్గొన్నారు.

యూట్యూబ్ చానల్‌పై చర్య తీసుకోవాలి



ములుగు : సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ.చాంద్ పాషా

ఏటూరునాగారం: ప్రజలు నమ్మక, ప్రజాదరణ పొందలేక అసత్య ప్రచారాలు చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పెట్టుకుందని, అవినీతి అక్రమాలకు అడ్డాగా మారిందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ యువతకు నైపుణ్యం కల్పించడానికి దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్యాయోజన స్కీం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం. అయితే ఈ స్కీంలో అవకతవకలు జరిగాయన్నట్లుగా ఒక యూట్యూబ్ చానల్ మంత్రి సీతక్క, పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్ పై కుట్రపూరితమైన కథనాన్ని ప్రసారం చేసింది. ఇది పూర్తిగా అవాస్తవం. యూట్యూబ్‌ల ద్వారా ప్రతిపక్ష బీఆర్ఎస్ బురదచల్లే ప్రయత్నం చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఖలీల్, దేవేందర్, ఎల్లయ్య, లాలయ్య, రియాజ్, ఎల్లయ్య, శ్రీనివాస్, ప్రసాద్, రమేష్, రాంబాబు, రంజిత్, రాజు పాల్గొన్నారు.

మంగపేట : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని ఓర్చుకోలేని ఓ యూ ట్యూబ్ చానల్‌లో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని నమ్మొద్దని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వం అని కొనియాడారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం

ములుగు: ప్రజాపాలన చేస్తున్న ప్రభుత్వంపై కొన్ని యూట్యూబ్ చానల్స్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని కాంగ్రెస్ ములుగు మండల అధ్యక్షుడు ఎండీ.చాంద్ పాషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్క, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానళ్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. నైపుణ్య శిక్షణ పథకంలో అవకతవకలు జరిగినట్లు ప్రచారం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నిబంధనలకు లోబడే ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రేగులగూడెంలో కేడీసీఎంఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కాటారం: ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ అన్నారు. మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలు, ఎరువుల కేంద్రాలు, పలు డీసీఎంఎస్, కేడీసీఎంఎస్, పీఏసీఎస్ కేంద్రాలను మంగళవారం ఏడీఏ తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న ఎరువుల స్టాక్ వివరాలు, విక్రయ రిజిస్టర్లు, సంబంధిత పత్రాలను పరిశీలించారు. రైతు సేవాకేంద్రాలైన డీసీఎంఎస్, కేడీసీఎంఎస్, పీఏసీఎస్ ద్వారా రైతులకు సేవలు అందించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారిని పూర్ణిమ, ఏఈఓ రాజన్న ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన

టేకుమట్ల: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన అన్నారు. మండలంలోని సోమనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ పోషణ మాసోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సరోజన హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల పుట్టిన, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వాజేడు : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మహేందర్



వెంకటాపురం(కె) : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వాజేడు/వెంకటాపురం(కె): ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వాజేడు, పేరూరు, ఎదిర వైద్యాధికారులు మహేందర్, రాహిల్, భవ్యశ్రీ అన్నారు. వాజేడు మండలంలోని అయ్యవారిపేట, పాయబాటలు, దూలాపురం, ప్రగళ్లపల్లి, మొరుమూరు గ్రామాల్లో, అలాగే వెంకటాపురం(కె) మండలంలోని వీరభద్రవరం, తిప్పాపురం, లక్ష్మీనగరం, ఆలుబాక, ఎదిర గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్య శిబిరాలతో పాటు ఇంటింటి సర్వే నిర్వహించారు. అయ్యవారిపేటలో 128 మంది రోగులను పరీక్షించగా అందులో 11 మందికి జ్వరాలు ఉన్నట్లు వైద్యాధికారి రాహిల్ తెలిపారు. పాయబాటలు, దూలాపురం, ప్రగళ్లపల్లి, మొరుమూరు గ్రామాల్లో 89 మది రోగులను పరీక్షించి మందులను అందించి నట్లు డాక్టర్ మహేందర్ వెల్ల డించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరాల తీవ్రత పెరుగుతున్న క్రమంలో జ్వరం బారిన పడిన ప్రతీ ఒక్కరు పీహెచ్‌సీలకు విధిగా వచ్చి వైద్యం చేయించు కోవాలని కోరారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉంటే కాలువలు తీసి తొలగించుకోవాలని సూచించారు. శిబిరంలో వైద్యాధికారులు స్నేహ, ఆశిష్, వినయ్, సోహెల్, పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ములుగు రూరల్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాయినిగూడెం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని జగ్గన్నపేట పంచాయితీ పరిధి పులిగుంటలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరంలో బాధపడుతున్న వారి రక్తపూతలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో 8 మంది జ్వరంతో బాధ పడుతుండగా వారికి చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు.



నీటి నిల్వల ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో డాక్టర్ రవళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు



ములుగు రూరల్ : జిల్లాలో గోదావరి వరద ఉధృతి కారణంగా వాజేడు మండలం టేకులగూడెం వద్ద జాతీయ రహదారి-163 పై గోదావరి వరదతో చత్తీస్‌ఘడ్, భూపాలపట్నం వెళ్లే వాహనదారులు భూపాలపల్లి మీదుగా వెళ్లాలని ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని జంగాలపల్లి వద్ద వాహనాల మళ్లింపునకు జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు బోర్డులను ఏర్పాటు చేసి వాహనాలను మళ్లించారు. వాహనదారులు గణపురం, భూపాలపల్లి, కాటారం, కాళేశ్వరం మీదుగా వెళ్లాలని సూచించారు.

పాఠశాలల తనిఖీ

మొగుళ్లపల్లి: మండలంలోని కొరికిశాల గ్రామంలోని మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ పాఠశాలలను తహసీల్దార్ సునీత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. వంటశాలలో నాణ్యమైన సరుకులు, కూరగాయాలు సక్రమంగా లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా గణేశుడి నిమజ్జనం



నిమజ్జనానికి తీసుకెళ్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వాజేడు: మండల పరిధిలోని నాగారం ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వినాయకుడికి పాఠశాలలో మూడు రోజుల పాటు పూజలను నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వామి వారిని ఊరేగింపుగా విద్యార్థుల నృత్యాలతో తీసుకు వెళ్లారు. స్వామి వారిని పావన గోదావరిలో నిమజ్జనం చేశారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక

చిట్యాల: విద్యార్థులు పరీక్షలలో మార్కులు తగ్గినా ఏలాంటి పరిస్థితుల్లోనైనా మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఆత్మస్థైర్యంతో ముందుగు సాగాలని ఒడితల మెడికల్ ఆఫీసర్ ఆర్.మౌనిక అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్య నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మౌనిక హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుకోవాలని కోరారు. ఆత్మహత్యలు అనేవి దరిచేరకూడదని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని బాగా చదివి ఉన్నత శిఖరానికి ఎదగాలని తెలిపారు. ఏమైన సమస్యలు వస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14416కు డయల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ యుగేందర్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

భూపాలపల్లి రూరల్: చిట్యాల మండలం గోపాలపురం గ్రామానికి చెందిన సతీష్ అదృశ్యమై సోమవారం భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి(ఎస్ఎం) గ్రామ శివారులోని దొమ్మటిపల్లి చెరువు సమీపంలో శవమై కనిపించాడు. మృతుడి బంధువులు, భూపాలపల్లి పోలీసుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం గోపాలపురం గ్రామానికి చెందిన సతీశ్(34) కుటుంబ కలహాలతో గత మూడు రోజులుగా ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు సతీశ్ కనబడుటం లేదని ఆదివారం సాయంత్రం చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి (ఎస్ఎం) శివారు దొమ్మటిపల్లి చెరువు సమీపంలో వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులకు సతీశ్ శవమై కనిపించాడు. రైతులు పోలీసులకు, మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూపాలపల్లి పోలీసులు తెలిపారు.